క్లుప్తంగా

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



వెల్దండ: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏఓ శోభారాణి హెచ్చరించారు. మండల కేంద్రంలో మంగళవారం ఫర్టిలైజర్ దుకాణాలను సీఐ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ దుకాణాల డీలర్లు నిబంధనలు ఉల్లంఘించొద్దన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలన్నారు. ప్రతి షాపుల్లో ధరల పట్టికలను అందుబాటులో ఉంచాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. డీలర్లు, సిబ్బంది ఉన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి

ఉప్పునుంతల: జాతీయ ఉపాధిహామీ పథకం చట్టాన్ని పరిరక్షణ కోసం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 30న కలెక్టరేట్ ఎదురుగా నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల నాయకులు చింతల నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఉపాధి కూలీల వేతన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పనిదినాలను 200లకు పెంచి రోజు కూలీ రూ. 600లు ఇవ్వాలని కోరారు. మండలంలోని ఉపాధికూలీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు.

తిమ్మాజిపేటలో వైద్య శిబిరం



తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని హోలిషాలేం చర్చి ఆవరణలో మంగళవారం ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హోప్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కంటి, దంత, జనరల్ పరీక్షలు చేశారు. బీపీ, షుగర్, ఎక్స్‌రే, ఈసీజీ తదితర పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మొత్తం 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు హోలి షాలేం చర్చి నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టీం లీడర్ జంగయ్య, జయరాజ్, కంటి వైద్య నిపుణులు సంపత్, దంత వైద్య నిపుణులు మనోజ్ఞ, దానం పాల్ మోజెస్, భరత్, స్వాతి, భక్తసింగ్, సిబ్బంది స్వామి, కుసుమ, రవి, రాకేష్, సంఘం చైర్మన్, దేవదాసు, అధ్యక్షులు దానం బాల్‌రాజ్, సభ్యులు సురేందర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాణి అహల్యా బాయ్‌కి ఘన నివాళి



కల్వకుర్తి రూరల్: లోకమాత రాణి అహల్యా బాయ్ హోల్కర్ చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్ అన్నారు. మంగళవారం అహల్య బాయ్ శతజయంతి ఉత్సవాల కమిటీ నాగర్‌కర్నూల్ జిల్లా కన్వీనర్ బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి సౌజన్యంతో ఆమె జీవితంపై ముద్రించిన పుస్తకాలను బీజేవైఎం జిల్లా కార్యదర్శి నరేష్ దుర్గాప్రసాద్‌కు అందించారు. అనంతరం దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మొగలులు కూల్చివేసిన దేవాలయాలను మళ్లీ నిర్మించేందుకు ఎంతో కృషి చేశారని తెలిపారు. నాయకులు లక్ష్మీనరసింహ, సాయి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కొల్లాపూర్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని శిక్షకుడు పతంజలి శంకర్‌గౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో ఇంటర్నేషనల్ యోగా డే దశాబ్ది ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జూన్ 21 నాటికి కేంద్ర ప్రభుత్వం ఆయుష్ ఆధ్వర్యంలో చేపట్టిన యోగా డే వేడుకలు ప్రారంభించి పది సంవత్సరాలు అవుతోందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం కోసం యోగా చేయాలని కోరారు.



అకాల వర్షాలతో అవస్థలు



కుప్పగా పెట్టిన నువ్వుల పంట



మంచాలకట్టలో కృష్ణానది తీరాన సాగు చేసిన నువ్వులు, మినుము పంటలు

పెంట్లవెల్లి: మండలంలోని మంచాలకట్ట, మల్లేశ్వరం, వేముకల్లు, జటప్రోలు గ్రామాల్లో కృష్ణానది పరివాహక ప్రాంతంలో ప్రతి సంవత్సరం నీరు తొలగించాక రైతులు పంటలు సాగుచేస్తారు. ఈ సంవత్సరం నీరు ఆలస్యంగా తీయడంతో పంటలు కాస్త ఆలస్యంగా వేశారు. మినుములు, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేశారు. ఈ ఏడాది మార్చి తరువాత కూడా పంటలు చేతికి రాని దశలో రైతులు ఆందోళన చెందుతుంటే ఒక దిక్కు వర్షాలు, మరో దిక్కు జూరాల నుంచి దిగువకు చిన్నపాటిగా నీరు వస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. దాదాపు 800 ఎకరాల నుంచి 1200 ఎకరాల వరకు కృష్ణానది తీరాన పంటలు సాగు చేస్తారు. ఇప్పటికీ 100–150 ఎకరాలలో మాత్రమే పంట చేతికొచ్చింది. కృష్ణానది తీరాన పొలం రేగడి మట్టి కావడంతో ఒక వర్షం పడితేనే 10రోజుల పాటు బురదగా ఉంటుంది. అది ఆరాక మళ్లీ పంట పొలాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుంది. కాని ప్రస్తుతం రోజూ ముసురు పడుతుండడంతో అటు చేతికి వచ్చిన పంట బయటకు తెచ్చుకోలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

నీటి రాక మొదలైంది

ప్రతి సంవత్సరం వందలాది ఎకరాలు నువ్వులు, మినుములు, జొన్నల పంటల సాగు చేస్తాం. పంటలు చేతికొచ్చాక జూన్ లేదా జూలైలో కృష్ణానది నీళ్లు పారేవి. ప్రస్తుతం నీటి రాక మొదలైంది. దీంతో పంటలు చేతికి వస్తాయో లేదో అని భయం ఉంది.



– బాలరాజు, మంచాలకట్ట

పంట దెబ్బతినే అవకాశం

ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలతో పంటలు దెబ్బతినే అవకాశం ఉంది. పంట చేతికొస్తాయో తెలియని పరిస్థితి ఉంది. పంట పెట్టుబడి కూడా వచ్చేటట్లు లేదు. పంట చివరి దశలో వర్షాలు పడుతుండడంతో పంట బయటకు తెచ్చుకోలేకపోతున్నాం.



– వెంకటస్వామి, మల్లేశ్వరం

పంట మార్పిడితో అధిక దిగుబడి

బిజినేపల్లి: పంట మార్పిడితో అధిక దిగుబడి సాధ్యమని పాలెం కేవీకే సమన్వయకర్త డా. ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంట మార్పిడి చేయడం వలన పొలంలో మిగిలిపోయిన అవశేషాల ద్వారా చీడపీడల తక్కువగా వ్యాపిస్తాయన్నారు. ప్రస్తుతం విత్తనాలు విత్తుకునే రైతులు భూమి చల్లబడిన తర్వాతనే విత్తనాలు విత్తుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా. రాజశేఖర్, మండల వ్యవసాయాధికారి నీతి, ఏఈఓ కల్యాణి, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డా. ప్రభాకర్‌రెడ్డి

మెడికల్ కిట్ల పంపిణీ



కల్వకుర్తి రూరల్: మండలంలోని తురకలపల్లి, పంజుగుల గ్రామాల్లోని గర్భిణులకు మంగళవారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సమకూర్చిన మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. కిట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జాగృతి జిల్లా అధ్యక్షుడు గణేష్, శేఖర్‌గౌడ్, భీమయ్య, కాజా, నాగరాజు, అలివేల, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి తృతీయ వార్షికోత్సవం



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు

లింగాల: మండలంలోని అవుసలికుంటలో మూడు రోజుల పాటు నిర్వహించిన గ్రామ దేవత బొడ్రాయి మూడో వార్షికోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా బైండ్ల పూజారులు గ్రామ దేవతకు శక్తి పూజలు నిర్వహించారు. చివరిరోజు ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలు తలపై పెట్టుకొని ఊరేగింపుగా బయలుదేరారు. గ్రామ పొలిమేరలో ఉన్న గ్రామ దేవతలకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రంగినేని శ్రీనివాస్‌రావు, గ్రామపెద్దలు గ్రామ దేవతను దర్శించుకొని పూజలు చేశారు.

ఉపాధి పనులపై అవగాహన



తాడూరు: మండలంలోని యాదిరెడ్డిపల్లిలో కూలీలకు ఉపాధి పనులపై మంగళవారం ఎంపీడీఓ ఆంజనేయులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు ఉపాధి కూలీ పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పనుల వివరాలను కూలీలకు అర్థమయ్యే విధంగా తెలపాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కూలీలు, సిబ్బంది ఉన్నారు.

మాజీ ప్రధాని నెహ్రూ ఆశయాలు కొనసాగిస్తాం

కొల్లాపూర్: మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఆశయాలను కొనసాగిస్తామని టీపీసీసీ నాయకులు రంగినేని జగదీశ్వరుడు అన్నారు. పట్టణంలోని శ్రీవాణి విద్యానిలయంలో మంగళవారం నెహ్రూ వర్ధంతి నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి అయన పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పేదలకు పండ్లు, బ్రెడ్లు, చిన్నారులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది మధుసూదన్‌రావు, నాయకులు వెంకటస్వామి, జమీల్‌అహ్మద్ ఖాన్, గోవింద్‌గౌడ్, జుబేర్ ఖాన్ తదితరులు ఉన్నారు.



కొల్లాపూర్‌లో చిన్నారులకు నోట్‌పుస్తకాలు అందజేస్తున్న జగదీశ్వరుడు

తెలకపల్లి: మండల కేంద్రంలో భారత తొలి ప్రధాని పండిత్ నెహ్రూ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు నెహ్రూ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి నెహ్రూ చేసిన సేవలను కొనియాడారు. సింగిల్ విండో చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, ఖుర్షిద్, కావేరి, బద్యనాయక్, శివ, లక్ష్మణ్, షబ్బీర్ తదితరులు ఉన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పని సరిగా చేసుకోవాలని ఏఓ సందీప్‌రెడ్డి తెలిపారు. ఆయా గ్రామాల్లోని రైతు వేదికల వద్ద ఏఈఓలు అందుబాటులో ఉంటారని వివరించారు. దరిణి బుక్కు ఉన్న ప్రతి రైతు చేసుకోవాలని తెలిపారు. రిజిస్ట్రీ చేసుకోని రైతులకు కేంద్ర పథకాలు, కిసాన్ డబ్బులు నిలిచిపోతాయని వివరించారు.

చారకొండ: కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధి కోసం గ్రామాల్లో రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్టర్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి తనూజరాజ్ అన్నారు. మంగళవారం జూపల్లిలో ఫార్మర్ రిజిస్టర్ నమోదును ఏఈఓ సుష్మ నమోదును చేపట్టారు.

ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొడదాం

అచ్చంపేట రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దేశ్యానాయక్ పేర్కొన్నారు. పట్టణంలో మంగళవారం నియోజకవర్గంలోని అచ్చంపేట, ఉప్పునుంతల, పదర, అమ్రాబాద్ మండలాలకు చెందిన సీపీఎం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసే ప్రయత్నం కేంద్రం ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల కార్యదర్శులు సైదులు, నాగరాజు, పర్వతాలు, వెంకటయ్య, ఐద్వా మహిళా సంఘం జిల్లా నాయకురాలు నిర్మల, సైదమ్మ, రజిత, పెంటమ్మ, జంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కోడేరు: రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ కూలీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని రాజాపూర్‌లో సీపీఎం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు డబ్బులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈనెల 30న కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తునట్లు ధర్నాకు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నర్సింహ, కమిటీ సభ్యులు రవి, వెంకటమ్మ, శివశంకర్, కాంటం లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



రాజాపూర్‌లో మాట్లాడుతున్న పర్వతాలు

ఏఎంఓ ఆకస్మిక తనిఖీ



బల్మూర్: మండలంలోని కొండనాగుల ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘంలో ఏఎంఓ నరేష్, ఎస్‌ఐ రమాదేవిలు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా విత్తన స్టాక్, రికార్డులను పరిశీలించారు. నకిలీ విత్తనాలను గుర్తించే విధానంపై రైతులకు అవగాహన కలిపించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సీపీఎం గ్రామసభ

తెలకపల్లి: మండలంలోని గట్టురాయపాకులలో సీపీఎం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కేశవులు గౌడ్ మాట్లాడుతూ గతంలో ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభించిన బీఆర్‌ఎస్ బుద్ధి చెప్పారన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలన్నారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ నాయకులను గెలిపించుకుందన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామన్నారు. శంకర్‌గౌడ్, రవిందర్, విష్ణు, రుక్మోద్దిన్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: యువతి అదృశ్యమైన ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ మంగళవారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం జిల్లా కేంద్రానికి చెందిన సుస్మిత ఈ నెల 26న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లింది. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకి లభ్యం కాలేదు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రజా సమస్యలపై పోరాటం

నాగర్‌కర్నూల్ రూరల్: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు హెచ్ ఆనంద్‌జీ, జిల్లా సమితి సభ్యులు కృష్ణాజీ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో సీపీఐ మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే మెరుగైన విద్య

నాగర్‌కర్నూల్ రూరల్: ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన ఉంటుందని విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం వేడుకరావుపల్లి తండాలో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. పాఠశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులపై విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థులను పాఠశాలల్లో చేర్పిస్తే పాఠశాలలు మూతపడవని తెలిపారు. టీఎస్ యూటీఎఫ్ ఉపాధ్యాయులు కృష్ణ, మహేష్‌బాబు, గౌస్‌పాషా, మల్లయ్య, లక్ష్మిపతి తదితరులు పాల్గొన్నారు.

తాడూరులో..

తాడూరు: ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందుతుందని హెచ్‌ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలంలోని అల్లాపూర్, ఐతోలులో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పుస్తకాలు, దుస్తులు, భోజనం అందిస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు.



ఐతోలులో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు

యూటీఎఫ్ ఆధ్వర్యంలో బడిబాట

పెద్దకొత్తపల్లి : గ్రామాల్లోని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు చేర్పించాలని మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వేడుకరావుపల్లి తండాలో టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు కృష్ణ, మహేష్‌బాబు, గౌస్‌పాషా, మల్లయ్య, లక్ష్మిపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములవ్వాలి



కల్వకుర్తి రూరల్: ప్రతిఒక్కరూ సమాజసేవలో భాగస్వాములు కావాలని ఆర్టీసీ డిపో మేనేజర్ సుభాషిని అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అమావాస్య సందర్భంగా దాతల సహకారంతో ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్న ప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ సమాజ సేవలో ఆర్యవైశ్యుల పాత్ర ప్రత్యేకమైనదని కొనియాడారు. 400 మంది ప్రయాణికులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మహాసభ అధ్యక్షుడు శేఖర్, కార్యదర్శి ముత్యాలు, కోశాధికారి వీరేష్, ఉపాధ్యక్షుడు తర్నికల్ శ్రీనివాస్, కృష్ణయ్య, శ్రీనివాసులు, తరుణ్, రేవంత్, నితిన్, గండె రవి పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

తిమ్మాజిపేట: మండల కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో మంగళవారం ముగిసింది. మొదటి బహుమతి తిమ్మాజిపేట జట్టు, రెండో బహుమతి గొరిట జట్టు నిలిచింది. విజేత జట్టుకు రూ.10వేలు, రన్నర్ జట్టుకు రూ.5వేల నగదు కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కాళ్ల వరుణ్‌కుమార్, శ్రీశైలం, క్రీడాకారులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో చండీహోమం

తిమ్మాజిపేట: మండలంలోని అప్పాజిపల్లి గ్రామ సమీపంలో అప్పాద్రి గుట్టపై స్వయంభూగా వెలిసిన లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో మంగళవారం భక్తి శ్రద్ధలతో మహాచండీ హోమం నిర్వహించారు. అంతకు ముందు స్వామి వారి ఆలయం చుట్టు భక్తులు గిరి ప్రదక్షిణలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ కమిటీ అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి వేదంజోషి కృష్ణమూర్తి, ఆలయ కమిటీ సభ్యులు, పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

రైతులకు స్ప్రింక్లర్ల అందజేత

నాగర్‌కర్నూల్ రూరల్: మండలంలోని పెద్దముద్దునురు, మంతటి గ్రామాల్లో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు స్రింక్లర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు పాల్గొని మాట్లాడుతూ ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ప్రతి రైతు అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఓ జగన్, వైస్ ఎంపీపీ జెట్టి నిర్మల, రైతులు పాల్గొన్నారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంతో పాటు ముష్టిపల్లి, కల్వకోలు, చంద్రకల్ గ్రామాల్లో మంగళవారం సబ్సిడీపై జీలుగ విత్తనాలను వ్యవసాయ అధికారి శిరీష పంపిణీ చేశారు. విత్తనాలు కావల్సిన వారు రైతులు పట్టాదారు పాస్‌బుక్, అకౌంట్ బుక్, ఆధార్‌కార్డు తీసుకొని రైతులు రావాలని సూచించారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ సర్పంచ్‌లు, నాయకులను మంగళవారం తెల్లవారు జామున ఏఎస్‌ఐ శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుల్ శ్యామ్, చంద్రశేఖర్‌లు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సర్పంచ్ సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనరసింహారెడ్డి పిలుపు మేరకు సర్పంచ్‌లు పెండింగ్ బిల్లుల కోసం హైదరాబాదులో నిరసన తెలపేందుకు బయలుదేరుతారన్న సమాచారం మేరకు మాజీ సర్పంచ్‌లను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.1200కోట్లు పెండింగ్ బిల్లులు ఉంటే కేవలం రూ.179 కోట్లు విడుదల చేయడం సరి కాదన్నారు. అనంతరం పోలీసులు సొంతపూచికత్తుతో వారిని వదిలేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు మైసయ్య, మాజీ ఉప సర్పంచ్ నిరంజన్, నాయకులు అంజయ్య, సోమయ్య, బాల్‌లక్ష్మయ్య, నిరంజన్, శేఖర్, అశోక్ ఉన్నారు.

చదువుతోనే సమ సమాజ నిర్మాణం సాధ్యం



తెలకపల్లి: చదువుతోనే సమ సమాజం నిర్మాణం సాధ్యమని వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీపుజాత మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ మాట్లాడుతూ అంతరాలు లేని సమ సమాజం కోసం అందరు పోరాడాలన్నారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యకు 10 శాతం నిధులు కేటాయించాలన్నారు. బడీడు పిల్లలను బడికి పంపించాలన్నారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సునీల్‌కుమార్, తిరుమలేష్, కృష్ణయ్య, నాయకులు శంకర్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులకు వృత్తినైపుణ్య శిక్షణ

వెల్దండ: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో విద్యను అభ్యసించి నిరుద్యోగులుగా ఉన్న పూర్వ విద్యార్థులకు గురుకుల విద్యా సంస్థ వృత్తినైపుణ్య శిక్షణ ఇవ్వడానికి ప్రణాళికలు రూపొందించిందని వెల్దండ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణరత్నం మంగళవారం తెలిపారు. గురుకుల పాఠశాలల్లో 2017 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తి చేసిన ఉన్నత చదువులు అభ్యసించలేని స్థితిలో ఉండి, నిరుద్యోగులుగా ఉన్న విద్యార్థులకు వివిధ రంగాల్లో వృత్తి నైపుణ్య శిక్షణలు ఇస్తునట్లు వివరించారు. గురుకుల విద్యాసంస్థ వారు ఉన్నత ఫౌండేషన్ సహకారంతో శిక్షణ తరగతులు నిర్వహిస్తోందని తెలిపారు. నిరుద్యోగులుగా ఉన్న యువతీ, యువకులు 18 ఏళ్ల నుంచి 25 ఏళ్ల వయస్సు కల్గిన వారు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

కలెక్టర్‌కు వినతి

నాగర్‌కర్నూల్: అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ స్కింలో ఉమామహేశ్వర ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు ప్రత్యామ్నాయం చూపించాలని పలువురు రైతులు మంగళవారం కలెక్టర్ బదావత్ సంతోష్‌కు ఆయన చాంబర్‌లో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ బల్మూర్, అనంతవరం, అంబగిరి, మైలారం గ్రామానికి చెందని రైతులు పూర్తిగా జీవితాన్ని కోల్పోతారని వివరించారు. ఉమామహేశ్వర ప్రాజెక్టును పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఇళ్లు కోల్పోనున్న వారికి ఇళ్లు, భూములు కోల్పోతున్న వారికి భూములు కల్పించిన తరువాతే ప్రాజెక్టు పనులు చేపట్టాలన్నారు. రుషుల చెరువు రిజర్వాయర్ పనులు చేపట్టాలని, తెగిపోయిన పెద్దరాయుని చెరువు, రామగిరి గ్రామంలో రిజర్వాయర్ నిర్మించేందుకు అనుకూల స్థలాలు ఉన్నాయని ఈ మూడు నిర్మాణాలు చేపడితే ఉమామహేశ్వర రిజర్వాయర్ నిర్మాణం కన్నా ఎక్కువ నీరు వినియోగించుకోవచ్చని వివరించారు.

సమస్యాత్మక భూమిని పరిశీలించిన అధికారులు

లింగాల: మండలంలోని రాయవరం శివారులో సర్వే నంబర్ 83లో సమస్యాత్మకంగా భూమిని ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆదేశాల మేరకు మంగళవారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. రాయవరం, క్యాంపు రాయవరం శివారులో ఉన్న సర్వేనంబర్ 83లో ఉన్న 1,398 ఎకరాల పరంపోగు భూమిని కొన్ని దశాబ్దాల నుంచి భూమి లేని రైతులు సాగు చేసుకుంటున్నారు. కాని వారి పేరట భూములపై ఎలాంటి హక్కు పత్రాలు లేక పోవడంతో తమకు పట్టాలు ఇవ్వాలని రైతులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ భూమి ఓ పక్క అటవీ శాఖ, మరో పక్క రెవెన్యూ పరిధిలో ఉంటుందని ఆయా శాఖల అధికారులు వాదిస్తూ వస్తున్నారు. గతంలో రెవెన్యూ, అటవీ శాఖ వారు సంయుక్తంగా సర్వేను నిర్వహించారు. అయిన సమస్య పెండింగ్‌లో ఉంటోంది. సమస్య పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ ఇచ్చిన హామీ మేరకు ఆర్డీఓ మాధవి, తహసీల్దార్ పాండునాయక్ క్షేత్ర పరిశీలన జరిపి రికార్డులను పరిశీలించారు. గతంలో జరిగిన తప్పిదాలను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రంగినేని శ్రీనివాస్‌రావు అధికారులకు వివరించారు. ఈ భూమిలో నిరుపేదలైన అన్ని వర్గాల రైతులు కాస్తులో ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ నిబంధనల మేరకు అర్హులన రైతులు న్యాయం జరిగేలా చూస్తానని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈ సారైన సమస్య ఓ కొలిక్కి వస్తుందని రైతులు ఆశిస్తున్నారు.



నక్షాను పరిశీలిస్తున్న ఆర్డీఓ మాధవి